కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూల్లో) టమాటా లోకల్ రూ.13, వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, కాకర 35, బీరకాయ 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 18, క్యారెట్ 28, దొండకాయ 18, ఆలుగడ్డ 32, ఉల్లిగడ్డ 22, గోకరకాయ 28, దోసకాయ 15, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 09, చిక్కుడు 45, అర్వి 35, మునగ 21, చిలగడదుంప 55, బీట్‌రూట్ 19, కీర 20, ఫ్రెంచ్ బీన్స్ 60, కాప్సికమ్ 60గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అంబేడ్కర్ కాలనీ-2 అధ్యక్షుడిగా రాంచందర్


పెండల రాంచందర్

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్ అంబేడ్కర్ కాలనీ-2, హరిజన సంఘం అధ్యక్షుడిగా పెండల రాంచందర్ ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగిందని ఆయన తెలిపారు. కమిటీ వైస్ ప్రెసిడెంట్లు శ్రీనివాసులు, కేశవులు, జనరల్ సెక్రటరీ రాములు, జాయింట్ సెక్రటరీ వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాములు, బీ.వీ.విష్ణు, మొగిలయ్యలు ఎన్నికయ్యారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ


చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయన సతీమణి సృజన సోమవారం వీపీనగర్‌లో శానిటేషన్ మహిళా కార్మికులకు వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి చీరలను పంపిణీ చేశారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, నాయకులు మురళి, నగేష్‌నాయక్, శ్రీనివాసాచారి, సందీప్, రాజేశ్వరి, శివరామ, షేక్ ఉమర్, అనిల్, రవికుమార్, పద్మజ, గిరీష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి మూడ్రోజుల పాటు శ్రీరామనవమి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య తెలిపారు. మొదటి రోజు ఉదయం 6.50 గంటలకు సువర్ణ పుష్పార్చన కార్యక్రమం, 9.30 గంటలకు శ్రీసాయి లక్ష నామార్చన ఉంటుందన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవం ఎదురుకోళ్ల కార్యక్రమం, 10 గంటలకు కల్యాణం ఉంటుందన్నారు. గురువారం సాయంత్రం 7 గంటలకు శ్రీ షిరిడి సాయిబాబా, సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామివారి రథోత్సవం, విశేష పల్లకి శోభాయాత్ర ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని చైర్మన్ కోరారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఉప్పల్: ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థికి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా సోమవారం ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ రజితారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ఓటును అభ్యర్థించారు. కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్తు బాగుంటుందని, పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కంది ఆగిరెడ్డి, ఎండి తౌఫిక్, తవిడబోయిన గిరిబాబు, సర్వీ మురళీ గౌడ్, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, తెల్కల మోహన్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి స్పందన కరువు

చాదర్‌ఘాట్: ప్రతీ సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైందని మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఆయన స్పష్టం చేశారు. సర్కిల్‌లోని ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. యూసీడీ, ట్యాక్స్, ఇంజినీరింగ్ అధికారులున్నారు.

సునీతామహేందర్‌రెడ్డికి మద్దతివ్వండి


ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

చైతన్యపురి: మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కోరారు. సోమవారం చైతన్యపురిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర రెడ్డి సంఘాల కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి, పలువురు డివిజన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఎంపీగా ఉన్న మల్కాజ్‌గిరిలో తిరిగి కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. త్వరలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్సీకి వివరించారు. చైతన్యపురి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు సురేందర్‌రెడ్డి, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



నాగోలు: లోకకళ్యాణం, సనాతన ధర్మం కోసం ప్రముఖ జ్యోతిష్యులు కొరడా రామ్మోహన్‌శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఎల్‌బీనగర్‌లోని ఉమా మహేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రుద్ర సహిత, చండీయాగం, గణపతి, నవగ్రహ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొరడా రామ్మోహన్‌శర్మ మాట్లాడుతూ.. దేశంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని లోకకల్యాణార్థం పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

పీర్జాదిగూడ బీఆర్ఎస్ మరోషాక్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నేతలు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్, కార్పొరేటర్లు అమర్‌సింగ్, బి.నవీన్‌రెడ్డిల ఆధ్వర్యంలో పీర్జాదిగూడ కార్పొరేటర్ సుభాష్‌నాయక్, 14వ డివిజన్ కార్పొరేటర్ భర్త, సీనియర్ నాయకుడు పాశం బుచ్చియాదవ్, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.


చెరువు చుట్టూ నిర్మించి వదిలేసిన మట్టికట్ట

చెరువు సుందరీకరణెప్పుడో.. ?

ప్రశ్నార్థకంగా సరూర్‌నగర్ చెరువు అభివృద్ధి

అసంపూర్తి పనులతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

సైదాబాద్: నెక్లెస్‌రోడ్డు తరహాలో సరూర్‌నగర్ చెరువు చుట్టూ ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయడంలో భాగంగా అధికారులు మొదలుపెట్టిన సుందరీకరణ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. భారీ వర్షాలు కురిసే సమయాల్లో చెరువు పరిసర ప్రాంతాల్లో వరదలతో ఇబ్బందులు తలెత్తకుండా నియంత్రించే పనులు సహా, చెరువును సమగ్రంగా అభివృద్ధి చేసి చుట్టూ చక్కని రహదారి నిర్మించేలా మొదలైన పనులు ఆగిపోవడంతో తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. సరూర్‌నగర్ చెరువు, దాని పరిసరాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని, మినీట్యాంక్‌బండ్ తరహాలో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన ప్రకటనలు అమలుకు మాత్రం నోచుకోకపోవడానికి సరూర్‌నగర్ చెరువు అభివృద్ధి పనులు ఉదాహరణగా నిలుస్తున్నాయి.


అసంపూర్తిగా చెరువు తూము పనులు ఇలా..

అభివృద్ధి పనులు మొదలై ఐదేళ్లు...

సరూర్‌నగర్ చెరువు సుందరీకరణ, సమగ్రాభివృద్ధి కోసం గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద 2018లో రూ. 15 కోట్ల నిధులు మంజూరు చేసింది. 2019లో సుందరీకరణ పనులు ప్రారంభించారు.

ఐదేళ్లు గడిచినా పూర్తికాని పనులు..

చెరువు చుట్టూ మట్టితో కట్టను కట్టి నిర్మాణ పనులు కూడా అసంపూర్తిగా వదిలేశారు. అక్కడక్కడ ఎగుడు దిగుడులతో మట్టికట్ట అస్తవ్యస్తంగా నిర్మించారనే ఆరోపణలున్నాయి. చెరువు కట్టకు చుట్టూ కట్టిన మట్టికట్టకు పలుచోట్ల తూములు ఏర్పాటు చేశారు. వరద నీరు పరిసర కాలనీ ఇళ్లలోకి వెళ్లకుండా రహదారులపై నిలవకుండా ఉండేలా సాఫీగా నీరు మొత్తం చెరువుల్లోకి వెళ్లేలా తూములు నిర్మించాలి. కానీ వాటిని కూడా పూర్తిస్థాయిలో నిర్మించకుండా అసంపూర్తిగా వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజలకు ఇబ్బందులు...

వాకింగ్‌ట్రాక్ పనులు పూర్తి చేయకుండా నిలిపేయడంతో పరిసర కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి ఆఫీసర్స్ కాలనీ నుంచి శంకేశ్వరబజార్ మీదుగా ఉన్న సరూర్‌నగర్ చెరువు కట్టపై నుంచి గోల్డేజ్ హోమ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి వాహనదారులు, పాదచారులు సైదాబాద్, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్ వైపు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. చెరువు కట్ట పైభాగం అస్తవ్యస్తంగా ఉండటంతో నిత్యం దానిపై ప్రయాణించే సమయంలో కుదుపులతో ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు.

వ్యర్థాలను తొలగించాలి..

చెరువు పక్కన శంకేశ్వరబజార్ రహదారిపై బాక్స్‌డ్రైన్ నిర్మించిన సమయంలో వెలువడిన భారీ రాళ్లు, వ్యర్థాలను కట్టపై వేసి తొలగించకపోవడంతో వాటి వల్ల ఎప్పుడు ముప్పు వాటిల్లుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సరూర్‌నగర్ చెరువు అభివృద్ధి, వాకింగ్‌ట్రాక్ పనులు పూర్తి చేయించడంపై శ్రద్ధ చూపించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించాలి



ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ప్రభుత్వంలోనే మిషన్ కాకతీయ పథకం కింద చెరువు అభివృద్ధి కోసం నిధులు మంజూరైనా అధికారులు పనులు పూర్తి చేయించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదు.

– భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు

పనులను వేగంగా పూర్తి చేయాలి...



సరూర్‌నగర్ చెరువు చుట్టూ నిర్మిస్తున్న వాకింగ్‌ట్రాక్ నిర్మాణ పనులను అధికారులు వేగవంతం చేయాలి. చెరువు పరిసరాల్లోని సింగరేణి కాలనీ, గ్రీన్‌పార్క్ కాలనీ, శంకేశ్వరబజార్ వాసులు నిత్యం ఈ మార్గం మీదుగానే ప్రయాణిస్తుంటారు. మట్టితో నిర్మించిన వాకింగ్‌ట్రాక్ ఉపరితలం సరిగ్గా లేకపోవడంతో దానిమీద ప్రయాణించే సమయంలో అవస్థలు పడుతున్నారు. ప్రమాదకరంగా మట్టికట్టపై ఉన్న భారీ వ్యర్థాలను వెంటనే తొలగించాలి.

– షేక్ మహమూద్, సీపీఐ కార్యదర్శి

భార్య హత్య కేసులో ఐదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: భార్యను హతమార్చిన కేసులో నిందితుడు అబ్దుల్లా బిన్ సాలె (25)కు ఐదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4 వేల జరిమానాను విధించింది. వివరాల ప్రకారం.. ఫర్హీన్ ఉన్నీసాకు నాలుగు నెలల క్రితం అబ్దుల్లా బిన్ సాలె(25)తో వివాహం జరిగింది. పెళ్లైన మొదటి నెల భార్యభర్తలు అన్యోన్యంగానే ఉన్నారు. ఆ తరువాత భర్త తనని మానసికంగా, శారీరకంగా హింసించడం మొదలు పెట్టాడని ఫర్హీన్ ఉన్నీసా తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి తనని ఇంటికి తీసుకెళ్లమంది. అదే రోజు సాయంకాలం ఫర్హీన్ ఉన్నీసా తల్లికి ఫోన్ చేసిన నిందితుడు తన భార్య ఆత్మహత్య చేసుకుందని చెప్పాడు. దీంతో మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. తన భార్యను హతమార్చినట్టు తేలడంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు సోమవారం నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

పెళ్లి పేరుతో బాలికపై లైంగిక దాడి

నిందితుడికి యావజ్జీవ శిక్ష

రంగారెడ్డి కోర్టులు: పెళ్లి పేరుతో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందతుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధించిన రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి యం.కె. పద్మావతి. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్మాస్‌గూడకు చెందిన క్యాబ్ డ్రైవర్ మణికంఠ (23) అదే ప్రాంతానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాన్ని ఆసరాగా తీసుకున్న నిందితుడు ప్రేమ పెళ్లి పేరుతో మాయమాటలు చెప్పి బాలికపై లైంగిక దాడికి పాలపడ్డాడు. ఇదే తరుణంలో 2017 మార్చి 15న నిందితుడు మాయమాటలు చెప్పి బాలికను అపహరించాడు. ఇదే విషయమై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కేసు నమోదు చేసిన మీర్‌పేట్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు, సోమవారం నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 25వేలు జరిమానా విధించింది. భాధితురాలికి రూ.10 లక్షల నష్టపరిహారం మంజూరు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు న్యాయమూర్తి సిఫార్సు చేశారు.

పోక్సో కేసులో నిందితుల రిమాండ్

సైదాబాద్: మాయమాటలు చెప్పి బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లి అత్యాచారం చేసిన నిందితుడిని సైదాబాద్ పోలీసులు అరెస్టు చేశారు.

ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రయ్యహట్స్‌లో నివసించే రాజు ఇటీవల పదోతరగతి పూర్తి చేసుకున్న బాలికను ఎవరికీ చెప్పకుండా తనతో తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. సదరు బాలిక అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కిడ్నాప్, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మరో కేసులో..

నాగోలు: మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని నాగోలు పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్‌పూర్‌మెట్ మండలం మజ్రిపల్లికి చెందిన నల్ల రాజేష్ (29) స్థానికంగా ఉండే మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి గత 4 నెలల నుంచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు ఈనెల 12న నాగోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సెల్‌ఫోన్ల రికవరీ



చైతన్యపురి: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదు మేరకు సరూర్‌నగర్ పోలీసులు 30 సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈఐఆర్ యాప్ టెక్నాలజీ ద్వారా సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఫోన్లు పోగొట్టుకున్న 30 మంది బాధితులకు సోమవారం అందజేశామని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రద్దీ ఉండే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పిక్‌పాకెటర్స్, మొబైల్ దొంగతనాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, క్రైమ్ ఎస్సై సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాగానే కరెంట్ కోతలు !


ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో కరెంటు కోతలు, నీళ్ల కష్టాలు మొదలయ్యాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలాసుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ ఎంఈ రెడ్డి గార్డెన్స్‌లో సోమవారం నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజినిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి 4 నెలలు గడిచినప్పటికీ రూ.2 లక్షల రుణమాఫీ జరగలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని మహిళలకు రూ.2500 ఇస్తామని వాగ్దానం చేశారన్నారు. గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకే ఇస్తామని చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు, రైతుభరోసా పథకాలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేశాకే కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఓట్లు అడగాలని కోరారు. ప్రధాని మోదీ హయాంలో అన్ని ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, రమావత్ పద్మానాయక్, మహిళా నేత రంగేశ్వరీ, కొసనం ధనలక్ష్మీవెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- ప్రతి పోలింగ్ స్టేషన్ ను పరిశీలించాలి
- పోలింగ్ కేంద్రాల్లో వసతులపై నివేదిక ఇవ్వాలి
- హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమని హైదరాబాద్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మలక్‌పేట్, కార్వాన్, గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్ ఎఆర్ఓ,సెక్టర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సెక్టోరల్ ఆఫీసర్ తనకు కేటాయించిన అన్ని పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో వసతులు సక్రమంగా ఉంలా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై మంగళవారం సాయంత్రం లోగా తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు సమర్పించే నివేదికలను సంబంధిత నమూనా ఫార్మాట్‌లో పంపాలని సూచించారు. సెక్టోరల్ అధికారులకు మెజిస్టీరియల్ పవర్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. మాక్ పోల్ విషయంలో జాగ్రత్త వహించాలని, సంబంధించిన షీట్స్‌ను బాక్స్ లో నుంచి తీసివేసేలా చూడాలన్నారు. కంట్రోల్ యూనిట్‌ను సీల్ చేయాలని, పనిచేయని బీయూ, సీయూ, వీవీ ప్యాడ్స్‌ను తొలగించి వాటి స్థానంలో వెంటనే రిప్లేస్ చేయాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ వెంకటాచారి, ఏ ఆర్ ఓ లు, సెక్టోరల్ అధికారులు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ జహురుద్దీన్, తదితరులు పాల్గొన్నారు

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభించిన టీపీసీసీ ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: కామినేని చౌరస్తా బిగ్‌బజార్ సమీపంలో భగత్‌సింగ్ ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అశోక్, రుద్రేష్, ఆటో డ్రైవర్లు తదితరులున్నారు.

కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి సేవలో పీఠాధిపతులు


పీఠాధిపతులతో ఆలయ పాలక మండలి సభ్యులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామివారిని సోమవారం విశాఖ శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ పీఠాధిపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ, పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభం, మంగళవాయిద్యాలు వేద మంత్రోచ్ఛరణలతో ఆలయంలోకి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి తన సొంత ఖర్చుతో తయారు చేయించిన స్వామివారి ఊరేగింపు రథాన్ని వారు ప్రారంభించారు. అనంతరం పీఠాధిపతులు భక్తులకు సుభాషిత ప్రవచనాలు ప్రసంగాలు చేసి ఆశీర్వదించారు. పాలక మండలి సభ్యులు చాతిరి మధుసాగర్, అంజిరెడ్డి, తిరుమలేష్, మధుసూదన్‌రెడ్డి, ముద్ద కల్యాణ్, సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.

శ్రీరామనవమి, హనుమాన్ జయంతికి ఏర్పాట్లు



మలక్‌పేట: మలక్‌పేట శ్రీ కృపా మార్కెట్ ఎదురుగా ఉన్న పల్లాస్‌లోని హరిహర క్షేత్రం, మైసమ్మ దేవస్థానంలో శ్రీరామనవమి, హనుమాన్ జయంతికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ, చైర్మన్ సూగూరు రమేష్, ఈఓ జోషి మార్తాండరావు సోమవారం ఉత్సవాల వివరాలను తెలియజేశారు. ఈనెల 17న బుధవారం ఉదయం 10 గంటలకు సీతారామచంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని ప్రకటించారు. అనంతరం ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. 23న మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 6 గంటలకు ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు.

వరద కాలువతో ముంపునకు చెక్



చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని లోతట్టు కాలనీల్లో ఇప్పటికే ప్రారంభించిన వరదనీటి కాలువలతో వరద ముంపు సమస్యకు చెక్ పడుతుందని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్యభారతితో కలిసి మారుతీనగర్, మల్‌రెడ్డినగర్, ఉదయ్‌నగర్ కాలనీల్లో పర్యటించి వరదనీటి కాల్వల ఏర్పాటు పనులను పరిశీలించారు. సర్కిల్ అధికారులు రాజు, రాములు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆనంద్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, పతంజలి, కోటేశ్వర్‌రావు, సుఖజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


నర్సింహాచారి (ఫైల్)

నాగోలు : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ అయ్యప్పనగర్‌లో నివాసం ఉండే చెరుకుపల్లి నర్సింహాచారి(60) గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా ఉండటం లేదు. ఈనెల 13న ఆటోలో బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు నాగోలు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.